## క్లుప్తంగా

### క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన దృశ్యం

**పగిడ్యాల:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పాలూరు వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో గురువారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మోహన్‌దాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, తగిన ప్రోత్సాహకాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. దాతను ఉపాధ్యాయులు సన్మానించారు.

### నేడు నందీశ్వరుడికి ప్రదోష కాల అభిషేకం



నందీశ్వరుడు

**మహానంది:** మహానందిలో శుక్రవారం నందీశ్వర అభిషేకం నిర్వహిస్తున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. భాద్రపద మాసం, బహుళ త్రయోదశి సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేకం ఉంటుందన్నారు. ప్రదోషకాల నందీశ్వర అభిషేకంలో ఆర్జిత సేవాటికెట్ల ద్వారా పాల్గొనవచ్చన్నారు.

### మహానందిలో దసరా ఏర్పాట్లు షురూ



హోమగుండాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**మహానంది:** మహానందిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు త్రయోదశ కుండాత్మక శతచండీయాగం కోసం హోమగుండాలను నిర్మించే పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. యాగశాలకు శాశ్వతంగా లైట్లు, ఫ్యాన్లు, వైరింగ్, తదితర విద్యుత్ పనులు జరుగుతున్నాయి. వీటికి నంద్యాలకు చెందిన షేక్షావలిరెడ్డి, సింధు దంపతులు రూ.50 వేల విలువైన విద్యుత్ పరికరాలను అందించినట్లు వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**పెద్దదోర్నాల:** బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం శ్రీశైలం ఘాట్ రోడ్డులో సంభవించిన ప్రమాదంలో నందికొట్కూర్‌కు చెందిన రాకేష్ తీవ్రంగా గాయపడిన విషయం పాఠకులకు విదితమే. రాకేష్‌కు దోర్నాల వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు. మృతుడు కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో ప్రైవేట్ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

### పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

**బండి ఆత్మకూరు:** మండలంలోని ఈర్నపాడు, నారాయణాపురం గ్రామాల్లోని పశువులకు శుక్రవారం పశు వైద్యులు అనూష, జ్యోత్స్నదేవి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈర్నపాడులో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గోవింద నాయక్ పర్యవేక్షించారు. శుక్రవారం సంతజూటూరు, పార్నపల్లి గ్రామాల్లో టీకాల కార్యక్రమం ఉంటుందని రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని వారు సూచించారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి 4వ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన వారికి రెండేళ్ల టర్నర్, మెకానిక్ మోటార్ వెహికల్, పదో తరగతి ఫెయిల్ అయిన వారికి ఏడాది వెల్డర్ ట్రేడ్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 27వ తేదీలోగా www.iti.ap.gov.inలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సమీప ఐటీఐలో 28వ తేదీలోగా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని, 29న జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 08624-286055,9441181072, 9963999323, 6281792551, 9440849850 లను సంప్రదించాలన్నారు.



గొల్లపేటలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు



మురికి నీటిలోని కుళాయికి పైపు ఏర్పాటుచేసుకుని తాగునీటిని పట్టుకుంటున్న కాలనీవాసి

# ఇలా ఉంటే రోగాలు రావా!

**అసలే వర్షాకాలం..** సరైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల్లేక చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఎక్కడికక్కడే మురుగునీరు రోడ్లపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఆయా చోట్లా దోమలు వృద్ధి చెంది రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లోని ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలు జూపాడుబంగ్లాలోని గొల్లపేటలోనివి. సిమెంట్ రోడ్లు వేసినా డ్రైనేజీలు లేకపోవటంతో మురికినీరు రోడ్ల వెంట ప్రవహిస్తోంది. తాగునీటి కుళాయిలు సైతం మురుగునీటిలోనే ఉన్నాయి. తప్పనిపరిస్థితుల్లో వాటికి పైపును అమర్చి కాలనీవాసులు అదే నీటిని పట్టుకుని దాహం తీర్చుకుంటున్నారు. తాగునీరు కలుషితమై డయేరియా వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – జూపాడుబంగ్లా

## శరన్నవరాత్రోత్సవాలకు రండి

• డీఎస్పీని ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘం

**ఆత్మకూరు:** స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని ఈనెల 22 నుంచి నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలకు రావాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, సభ్యులు గురువారం డీఎస్పీ రామాంజినాయక్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. 22న శ్రీశైల పుత్రిగా, 23న బ్రహ్మచారిణిగా, 24న చంద్రఘంటాదేవి, 25న కూష్మాండదుర్గా, 26న కందమాతా, 27న వేంకటేశ్వరస్వామి, 28న మహాగౌరీదేవి, 29న సరస్వతిదేవి, 30న మహిషాసురమర్దినివి, అక్టోబర్ 1న సిద్ధదాయినీ, 2న విజయలక్ష్మీగా అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. 3న గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఉత్సవాల్లో అతిథిగా పాల్గొనాలని డీఎస్పీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. అనంతరం సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు ఆహ్వాన పత్రాలను అందించి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.వి.నాగరాజు, ఇస్కాల రమేష్, వేణు, గోపాల్, కిరణ్, నల్లబోలు బాలయ్య, నరహరి బాలయ్య, కిరణ్, చక్రపాణి పాల్గొన్నారు.



డీఎస్పీని ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

## వాహనమిత్రలతో ఈకేవైసీ చేయించండి



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ అన్వరాబేగం

**జూపాడుబంగ్లా:** వాహనమిత్రలతో ఈకేవైసీ చేయించాలని ఆత్మకూరు డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిణి(డీడీఓ) అన్వరాబేగం అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె జూపాడుబంగ్లా 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల పంచాయతీ కార్యదర్శులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆటో, మోటార్‌క్యాబ్‌లకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. పాసింగ్ కాగితాలు లేకపోయినా వాహనమిత్రల వివరాలు ఆన్‌లైన్ చేసి, పాసింగ్ సర్టిఫికెట్లను నెలరోజుల్లోగా సచివాయాల్లో అందజేయాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. అక్టోబర్ 1 నాటికి వాహనమిత్రల వివరాలు ఆన్‌లైన్ చేయడం పూర్తి కావాలన్నారు. డీడీఓ వెంట డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు మణికంఠ, ఫాతిమాబీ ఉన్నారు.

## పందులను తరలించండి

**జూపాడుబంగ్లా:** పక్షం రోజుల్లో పందులను మండల కేంద్రం నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ మల్లికార్జున పందుల పెంపకం దారులకు సూచించారు. పందులతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో గురువారం అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. రెండు నెలల క్రితమే సూచించినా ఇంత వరకు పందులను తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పందులు పంటలను నాశనం చేస్తున్నాయని, ఇళ్లల్లోకి సైతం వస్తూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయని రోజురోజుకు ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయన్నారు. ఈసారి పందులను తరలించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, డీటీలు నాగన్న, సత్యదీప్, సర్పంచ్ మొట్టి బాలయ్య పాల్గొన్నారు.



పెంపకం దారులతో మాట్లాడుతున్న అధికారులు

## వ్యక్తి ఆత్మహత్య

• 9 మందిపై కేసు నమోదు



ఆత్మహత్య చేసుకున్న బోయ వెంకటేశ్వర్లు

**కొత్తపల్లి:** ఓ వ్యక్తి గొర్రెల వ్యాధుల నివారణ కోసం వాడే మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ముసలిమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ జయశేఖర్ తెలిపిన వివరాలు.. నందికొట్కూరు వాల్మీకి నగర్‌కు చెందిన బోయ వెంకటేశ్వర్లు(40) పన్నెండేళ్ల క్రితం ముసలిమడుగు గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మను పెళ్లి చేసుకునే ఇక్కడే కాపురముంటున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన సామేలు తన గొర్రెను దొంగతనం చేశాడనే నెపంతో అతన్ని కొట్టాడు. సామేలును కొట్టడంతో అదే గ్రామానికి చెందిన జల్లి చిన్న లింగస్వామి, జల్లి ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురు సామేలును ఎందుకు కొట్టావని వెంకటేశ్వర్లును బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూలేని సమయంలో గొర్రెల వ్యాధుల నివారణ కోసం తెచ్చిపెట్టుకున్న మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు జల్లి చిన్న లింగస్వామి, జల్లి ఆంజనేయులుతోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పంచాయతీలకు నిధులు మంజూరు

**జూపాడుబంగ్లా:** మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బేసిక్ గ్రాంట్, టైడ్ ఫండ్ కలిపి రూ.85,30,358 లు మంజూరయ్యాయన్నారు. మొదటి ప్రాధాన్యతగా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. తాగునీటి కల్పన, గ్రామాల్లో అపరిశుభ్రత నివారణ, శానిటేషన్, వీధిదీపాల ఏర్పాటు, తాగునీటిచేతిపంపుల మరమ్మతులకు ఖర్చు చేయాలని సర్పంచులకు సూచించారు.

### అందుబాటులో యూరియా

**మహానంది:** మండలంలోని బుక్కాపురం, తిమ్మాపురం, బొల్లవరం, తమ్మడపల్లె రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాలుగు రైతు సేవా కేంద్రాలకు 96 టన్నుల యూరియా వచ్చిందన్నారు. మరో 100 టన్నుల యూరియా రానున్నట్లు చెప్పారు. రైతు పేర్లతో టోకెన్లు జారీ చేశామన్నారు. ఒక్కో పాసు పుస్తకానికి రెండేసి చొప్పున బస్తాలు అందిస్తామన్నారు. కాగా యూరియా పంపిణీ తీరు, కేటాయించిన మెట్రిక్ టన్నులు, వచ్చిన బస్తాల వివరాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

### స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి

**వెలుగోడు:** మండలంలో స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన బోయరేవుల, వెలుగోడు వార్డు సచివాలయాలను తనిఖీ చేసి సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు.

### నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

**నంద్యాల(న్యూటౌన్):** ఉమ్మడి కర్నూలు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా సెక్రటరీ విశ్వనాథ్, మహిళా సెక్రటరీ ఆశాజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు హెచ్‌ఎం సంతకంతో ఎలిజిబులిటీ ఫారం తీసుకొని రావాలని సూచించారు.

### కబడ్డీ కోచింగ్ ప్రారంభం

**నంద్యాల(న్యూటౌన్):** ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పాణ్యం మండలంలోని విజయానికేతన్, గడివేముల హైస్కూల్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం విజయానికేతన్ క్రీడా మైదానంలో బాలబాలికలకు కోచింగ్ క్యాంపును ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

•మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

**ఆత్మకూరు:** మహిళలు ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. గురువారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన స్వస్తి నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళల కోసం శిబిరాలు ఏర్పాటు చేసి రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణాధ్యక్షులు వేణుగోపాల్‌శెట్టి, వరదరాజుల స్వామి ప్రాజెక్టు చైర్మన్ మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ షాబుద్దీన్, మెరీబా మేనేజర్ జుల్ఫీకర్, డెంటల్ డాక్టర్ సుభాషిని, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు పాల్గొన్నారు.

•**బండి ఆత్మకూరు:** స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో స్వస్త్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. హోమియో, ఆయుర్వేద, యునాని విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు. నంద్యాల హోమియో వైద్యాధికారి అరుణ మాట్లాడుతూ స్త్రీ అంటే ఆదిశక్తి అని, ఆరోగ్యకరమైన మహిళలే బలమైన కుటుంబాలకు పునాది అవుతారన్నారు. రక్తహీనత బారిన పడకుండా మహిళలు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. యోగా నిపుణులు నాగేశ్వర రావు పిల్లలకు యోగాసనాలను చేయించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ, సురేష్, జవాడి మార్టిన్ యశోదర, ఆయుర్వేద వైద్యాధికారి నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

## నష్టపరిహారం అందించాలి



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

**ఆత్మకూరు:** అటవీ జంతువుల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు, రైతులు గురువారం శివపురం ఫారెస్ట్ సెక్షన్ కార్యాలయంలో రేంజర్ బాలాజీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘం మండల నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మిరెడ్డి, గుమ్మడాపురం కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం, చిన్నగుమ్మడాపురం, సింగరాజుపల్లె గ్రామాల్లో పెద్ద ఎత్తున అటవీ జంతువులు, పందుల వల్ల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు చిన్నస్వాములు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాధితులు

**ఆత్మకూరు:** తమ స్థలాన్ని కబ్జా చేసి, తమపై దాడి చేసి, తమపైనే అక్రమంగా కేసు పెట్టిన రంగనాయకులుపై చర్యలు తీసుకోవాలని కరివేన గ్రామానికి చెందిన మహిళా రైతులు బర్నాల క్రిష్ణమ్మ, గీతమ్మ, మాధవరం వినోద్‌కుమార్, సీహెచ్ మధు, నారాయణ, రాజు డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 16న రంగనాయకులు అనే వ్యక్తి తమ 93 సెంట్ల స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడన్నారు. ఈ పొలాన్ని తాము 2019లో తమ గ్రామంలోని అగ్రహారానికి చెందిన బ్రాహ్మణులు మురళీకృష్ణశర్మ, బి.వి.చక్రవర్తిల నుంచి కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి ఈ భూమి తమ ఆధీనంలో ఉందన్నారు. 2019 నుంచి తాము సాగుచేస్తూ ఉంటే ఐదు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా పొలంలో కంచె వేశాడన్నారు. అడ్డుకునేందుకు వెళ్లగా దాడి చేసి, తమపైనే పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసులు విచారించి రంగనాయకులుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పశువైద్యశాలల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు

**పాములపాడు:** పాములపాడు, మిట్టకందాల పశువైద్య కేంద్రాలను ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీవ్ర జ్వరం, అధిక ఉష్ణోగ్రత, పెదవులకు పుండ్లు, నోటి దుర్వాసన, కాలి గిట్టల మధ్య చిగుళ్ల వాపుతో కుంటడం గాలికుంటు వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుందన్నారు. ప్రతి గ్రామంలో పాడి పశువులున్న రైతుల ఇంటి వద్దకు వెళ్లి గాలికుంటు వ్యాధి టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డాక్టర్లు భాస్కర్, సాయిలీల, వీఏ స్వాతి ఉన్నారు.

## హామీలు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

**పాములపాడు:** ఎన్నికల ముందు వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్వరుడు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న ఆర్డీఓ కార్యాలయం వద్ద, 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

**కనీస వేతనాలు ఇవ్వాలి**

**నందికొట్కూరు:** సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఉమ్మడి కర్నూలు జిల్లా వీఆర్వో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నర్సరాజు, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. వీఆర్వోల అసోసియేషన్ నాయకులు, కమ్యూనిస్టు పార్టీలు వీఆర్‌ఏల ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 14 నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేస్కేల్ అమలు చేయాలన్నారు. అర్హతలున్న వారందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీల నాయకులు శేఖర్, సామన్న, గాబ్రెల్, సుధాకర్, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు మహేశ్వర, కార్యదర్శి శివన్న, సభ్యులు రంగస్వామి, మహేశ్వరుడు, పుధాకర్, మాధవి, శ్రీనివాసులు, సుజాత పాల్గొన్నారు.



వేతనాలు పెంచాలని కోరుతూ ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

## 22 నుంచి దేవీ నవరాత్రుల ఉత్సవాలు

**కొత్తపల్లి:** ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు కొలనుభారతిదేవి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.రామలింగారెడ్డి గురువారం తెలిపారు. కొలనుభారతి దేవి ఆలయంలోని సరస్వతి దేవి అమ్మవారు 9 రోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. 22న బాలత్రిపురసుందరీ దేవి, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణదేవి, 25 కాత్యాయని దేవి, 26న మహాలక్ష్మీ దేవి, 27న లలితాత్రిపుర సుందరీ దేవి, 28న మహాచండీ దేవి, 29న సరస్వతి దేవి అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. 30న దుర్గాదేవిగాను, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని, 2న విజయదశమి రోజున రాజరాజేశ్వరి దేవి అలకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు.



సరస్వతి అమ్మవారు

## లక్ష్యాలను సాధించాలి

• ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి

**వెలుగోడు:** మహిళా సాధికారత దిశగా స్వయం సహాయక సంఘాల సంక్షేమ, అభివృద్ధికి ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు వ్యవస్థాపక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించుకోవాలన్నారు. ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించిన అంశాలు, ఎజెండా పుస్తకంలో నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన సభ్యులు సక్రమంగా కంతులు చెల్లించాలన్నారు. పొదుపు చేసుకున్న డబ్బు దుర్వినియోగం కాకుండా చూసుకోవాలన్నారు.

## పెన్షన్‌దారులను ఇబ్బందులకు గురిచేయొద్దు

**నందికొట్కూరు:** ప్రభుత్వం పెన్షన్‌దారులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ట్రెజరరీ అధికారి లక్ష్మీదేవి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, కంప్యూటర్లను పరిశీలించారు. ప్రతి నెలా ప్రభుత్వ పెన్షనర్లకు, ఉద్యోగులకు జీతభత్యాలకు సంబంధించి జాప్యం ఎందుకు చేస్తున్నారని ఎస్టీఓ రాజును ఆమె ప్రశ్నించారు. ట్రెజరీ కార్యాలయంలో ఎవరు ఇబ్బందులు పడినా జిల్లా కార్యాలయానికి ఫిర్యాదు చేయాలన్నారు. వయో వృద్ధులైన ప్రభుత్వ పెన్షన్‌దారులకు కంప్యూటర్‌లో జరుగుతున్న ఆన్‌లైన్ సాంకేతిక లోపాలను సరిదిద్ది ప్రతి నెలా సమయానికి పింఛన్ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.